దీపావళి సందర్భంగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీర్ హరీశ్ రావును బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనపురం శశిపాల్ హైదరాబాద్ కోకాపేటలోని ఆయన నివాసంలో గురువారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ అందరి ఇంటా వెలుగులు నింపాలని మాజీ మంత్రి హరీశ్ రావు ఆకాక్షించినట్లు శశిపాల్ తెలిపారు.
– చేవెళ్ల రూరల్, నవంబర్ 1

కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలి

- ఇన్‌చార్జి జడ్పీ సీఈవో రంగారావు
- గ్రామాల్లో పర్యటిస్తున్న అధికారులు, సిబ్బంది

చేవెళ్ల రూరల్ : చందిప్ప గ్రామంలో సర్వేను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జడ్పీ సీఈవో రంగారావు

యాచారం: గున్‌గల్‌లో కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారిణి సంధ్యారాణి

చేవెళ్ల రూరల్, నవంబర్ 1: సమగ్ర కుటుంబ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఇన్‌చార్జి జడ్పీ సీఈవో రంగారావు అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లి మండల పరిధిలోని చందిప్ప, ఎల్వర్తి గ్రామాల్లో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేస్తున్నామని, తప్పులకు ఆస్కారం లేకుండా అంకిత భావంతో సిబ్బంది పని చేయాలని సూచించారు. ఆయన వెంట ప్రత్యేక అధికారి సురేశ్, ఎంపీడీవో వెంకయ్యగౌడ్, తహసీల్దార్ సురేందర్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

సర్వే పక్కాగా ఉండాలి

యాచారం: మండల పరిధిలో సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను పక్కాగా చేపట్టాలని దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి, మండల ప్రత్యేకాధికారిణి సంధ్యారాణి సూచించారు. మండల పరిధిలోని గున్‌గల్, గడ్డమల్లాయగూడ గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. కుటుంబ సర్వే నిర్వహిస్తున్న తీరును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. మండలంలోని అన్ని గ్రామాలలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను ఎలాంటి ఆటంకాలు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వేలో కుటుంబ యాజమాని, కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు సేకరించాలన్నారు. సర్వే చేసిన ఇంటికి స్టిక్కర్‌ను అంటించాలని ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లకు సూచించారు. అధికారులు చేపడుతున్న సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన సర్వే

ఆమనగల్లు: ఈ నెల 6 నుండి 19 వరకు ప్రభుత్వం నిర్వహించే సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించి నేటి నుంచి 6వ తేది వరకు మండలంలోని 13 గ్రామ పంచాయతీలతో పాటు ఆమనగల్లు మున్సిపాలిటీలో సమగ్ర కుటుంబ సర్వే చేపట్టినట్లు ఎంపీడీవో కుసుమ మాధురి, కమిషనర్ వసంత తెలిపారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్యుమరేటర్లతో కలిసి వారు ఇంటింటి సర్వే చేపట్టారు.కార్యక్రమంలో ఎన్యుమనేటర్లు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ పరిధిలో..

తుర్కయాంజాల్: ప్రభుత్వం చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలంతా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా సిబ్బంది ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి సర్వే ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ ఫ్లోర్ లీడర్ కోశికె అయిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

మంచాలలో..

మంచాల: కులగణనలో భాగంగా ఇంటింటి సర్వేకు వచ్చే అధికారులకు ప్రజలు సహకరించాలని ఎంపీడీవో బాలశంకర్, తహసీల్దార్ ప్రసాద్‌రావు, ఎంపీవో ఉమారాణి అన్నారు. మండల కేంద్రంతో పాటు తాళ్లపల్లిగూడలో శుక్రవారం ఇంటింటి సర్వేలో భాగంగా ఇంటి నంబర్లు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన సర్వేకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : మేడిగడ్డ తండాలో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఎంపీడీవో కుసుమ మాధురి

తుర్కయాంజాల్: సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలిస్తున్న తుర్కయంజాల్ మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి



మంచాల : తాళ్లపల్లిగూడలో ఇంటింటి సర్వేలో పాల్గొన్న తహసీల్దార్ తదితరులు

వస్త్ర దుకాణంలో చోరీ

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 1: అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని తారామతిపేట గ్రామంలోని వస్త్ర దుకాణంలో చోరీ జరిగింది. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బండారి కృష్ణారావు గ్రామంలోని చౌరస్తాలో వస్త్ర దుకాణం నిర్వహిస్తున్నారు. గత నెల 30న రాత్రి ఎప్పటిలాగానే దుకాణం మూసివేసి ఇంటికెళ్లారు. శుక్రవారం ఉదయం దుకాణం తెరువగా.. వెనుకనుంచి షాప్ తలుపులకు ఉన్న తాళాలు విరగొట్టి నట్టు గుర్తించారు. రూ.30 వేల నగదుతోపాటు రూ.5 వేల విలువైన వస్త్రాలను ఎత్తుకెళ్లినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాములు యాదవ్ (ఫైల్)

కడ్తాల్, నవంబర్ 1: వినాయక నిమజ్జనోత్సవంలో ప్రమాదవశాత్తు గాయపడిన వ్యక్తి దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కడ్తాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ శివప్రసాద్ తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన గోరేటి రాములు యాదవ్ (45) అక్టోబర్ 20న వినాయక నిమజ్జనోత్సవంలో పాల్గొన్నారు. పూజల అనంతరం వినాయకుడిని చెరువులో నిమజ్జనం చేసేందుకు క్రేన్ సాయంతో ట్రాక్టర్‌లోకి ఎక్కిస్తున్నారు. ఈ క్రమంలో డ్రైవర్ గంగునాయుడు క్రేన్‌ను అజాగ్రత్తగా నడపడంతో, క్రేన్‌కి పైన ఉన్న ఇనుపకొండి తెగిపోయి మొదటగా వినాయకుడి విగ్రహంపై పడి, ఆ తర్వాత రాములుతోపాటు భార్య సునీత మీద పడింది. ప్రమాదంలో రాములు తలకు, వెన్నుపూసకు, కాళ్లకు బలమైన గాయలవ్వగా, సునీత తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు గాయపడిన ఇద్దరిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. దవాఖానలో సునీత కోలుకొన్నది. రాములును మెరుగైన చికిత్స కోసం మరో దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తిలోని ప్రభుత్వ దవఖానకు తరలించినట్లు సీఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి

మైసిగండిలో దత్తాత్రేయస్వామి ఆలయ నిర్మాణం పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, నవంబర్ 1: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మైసిగండిలో పురేనగిరి గుట్టపై చేపట్టిన దత్తాత్రేయస్వామి, శివాలయం నిర్మాణ పనులకు సోమవారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్క రూ భక్తిభావాన్ని పెంపొందించుకొని సన్మార్గంలో నడవాలని తెలిపారు. అనంతరం మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆ తర్వాత మైసిగండి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఆయనకు ఆలయ సిబ్బంది, నిర్వాహకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆర్పీ జ్యోతి, టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ, ఆలయ ట్రస్టీ శిరోలీపంతూనాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, చందోజీ, సురేందర్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, దూద్యానాయక్, శేఖర్‌గౌడ్, హీరాసింగ్, జవహర్‌నాయక్, తులసీరాంనాయక్, కేశవులుగౌడ్, రమేశ్‌గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విద్యార్థి రాజ్జిని అభినందిస్తున్న ఎమ్మెలే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్, నవంబర్ 1: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని శివమారుతి గీతా అయ్యప్ప మందిరం ప్రధాన అర్చకులు రవిశర్మ, మాధురి దంపతుల కుమార్తె రాజ్జి చదువుతో పాటు కూచిపూడి, జానపదం, నాటక రంగాల్లో రాణిస్తూ పలు బహుమతులను కైవసం చేసుకోవడంతో శుక్రవారం అమెను ఎమ్మెల్యే సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనేక రంగాల్లో రాణిస్తూ ఎన్నో బహుమతులను సొంతం చేసుకున్న విద్యార్థి రాజ్జిని అదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్కార భారతి జాతీయ సాంస్కృతిక సంస్థ షాద్‌నగర్ గౌరవ అధ్యక్షుడు రంగనాథం, నవోదయ సేవాశ్రమం నిర్వాహకుడు రంగారెడ్డి, మిన్నిస్టీ అఫ్ కల్చర్ మెంబర్ టీవీ రంగయ్య, నాయకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల కొమ్మలను తొలగించాలి

ఇబ్రహీంపట్నంరూల్, నవంబర్ 1: సాగర్ రహదారిలోని పెద్ద చెరువు కట్ట కింద ఉన్న బైపాస్ రోడ్డులో ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను వెంటనే తొలగించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కంబాలపల్లి భరత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో పలుమార్లు ఫిర్యాదు చేసినా తూతూమంత్రంగా తొలగించి వదిలేశారని తెలిపారు. కొమ్మలు రోడ్డుపైకి రావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కూలీలకు ఇచ్చిన హామీని అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు

చేవెళ్లటౌన్, నవంబర్ 1: తెలంగాణలో వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల మల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో అంజయ్య అధ్యక్షతన ప్రజా సమస్యలు పరిష్కార మార్గాలు అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జంగయ్య, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రామస్వామి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ప్రభులింగం, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగిరెడ్డి, సీపీఐ మండల కార్యదర్శులు సత్తి రెడ్డి, జంగయ్య, సుధీర్, మహిళా నాయకురాలు మంజుల, స్వరూప, నాయకులు తదితరులు ఉన్నారు.

క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేత

క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న ఏసీపీ కేపీవీ రాజు

యాచారం, నవంబర్ 1: మండల పరిధిలోని మాల్‌లో నిర్వహిస్తున్న ఎంపీఎల్ సీజన్-1 క్రికెట్ పోటీలు గురువారం ముగిశాయి. ఏసీపీ కేపీవీ రాజు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీఐ శంకర్‌కుమార్, ఎస్సై సత్యనారాయణ, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సదర్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఇబ్రహీంపట్నంరూరల్: దీపావళిని పురస్కరించుకొని యాదవ సోదరులు భక్తి శ్రద్ధలతో నిర్వహించే సదర్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు అన్నారు. మండల పరిధిలోని పోచారం గ్రామంలో మాజీ సర్పంచ్ బలరాం యాదవ్, కాంగ్రెస్ నాయకుడు తుమ్మటి రమేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ గ్రామంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో బీఆర్ఎస్ సీనియర్‌నాయకులు క్యామ మల్లేశ్ పాల్గొన్నారు.

నరెడ్లగూడ రోడ్డులో కమ్ముకున్న మంచు

కమ్ముకున్న మంచు

షాబాద్‌లో పంట పొలాలపై కమ్ముకున్న మంచు

షాబాద్, నవంబర్ 1: మండల పరిధిలో మంచుతెర కమ్ముకుంది. శుక్రవారం తెల్లవారు జాము నుంచి రహదారులు, పంట పొలాలన్నీ మంచుతో కమ్ముకున్నాయి. వ్యవసాయ పొలాలకు, ఇతర పనులకు వెళ్లే రైతులు మంచు కారణంగా కొద్దిగా ఆలస్యంగా వెళ్లారు. గ్రామాలన్నీ మంచుతో కమ్ముకున్నాయి.

మేడిగడ్డ తండాలో సొప్పలారీ దగ్ధం

ఆమనగల్లు, నవంబర్ 1: సొప్ప లారీ దగ్ధమై తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండల పరిధిలోని మేడిగడ్డ తండాలో శుక్రవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ఆమనగల్లులో నివాసముండే మేడిగడ్డ మాజీ సర్పంచ్ గోపి నాయక్ పశుగ్రాసం కోసం శంకర్‌కొండ తండాలో రైతుల నుంచి సొప్ప కొనుగోలు చేశారు. లారీలో ఆమనగల్లుకు తరలిస్తుండగా మేడిగడ్డ తండాలో ఆంజనేయస్వామి గుడి వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న ఓ ఇంటి విద్యుత్ సర్వీస్ వైరు లారీలోని సొప్పకు తాకింది. వైరు తెగి షార్ట్ సర్యూట్‌తో సొప్పపై మెరుపులు పడటంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పేందుకు విఫలయత్నం చేశారు. ఏఎస్సై బాల్‌రెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని అగ్నిమాపక అధికారులకు సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చే లోపే సొప్ప పూర్తిగా దగ్ధమైంది. లారీ డ్రైవర్ వెంటనే కిందికి దూకడంతో తృటిలో ప్రమాదం తప్పింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాల్‌రెడ్డి తెలిపారు.

కార్మికుల హక్కుల సాధనకు సంఘటితం కావాలి

చేవెళ్లటౌన్: ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

చేవెళ్లటౌన్, నవంబర్ 11: హక్కుల సాధన కోసం కార్మికులందరూ సంఘటితం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి, జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ తెలిపారు. ఏఐటీయూసీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక చట్టాలను నీరుగార్చడంతో పాటు వారికి హక్కులు లేకుండా చేసేందుకు 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చి కార్మికుల జీవితాలను మరింత దుర్భరం చేశారని అవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శివయ్య, కౌన్సిల్ సభ్యులు బడ్ల మంజుల, మీనాక్షి, మండల అధ్యక్షుడు శివ, యాదగిరిచ సీపీఐ పార్టీ మండల కార్యదర్శులు సత్తిరెడ్డి, సుధీర్, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

చట్టాల రద్దుతో కార్మికుల జీవితాలు దుర్భరం

తుర్కయాంజాల్: కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 44 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మిక కుటుంబాల జీవితాలను దుర్భరం చేశారని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య అన్నారు. ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలను గురువారం మున్సిపాలిటీ చౌరస్తాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజాల్: ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్న ఓరుగంటి యాదయ్య

గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలి



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు

కడ్తాల్, నవంబర్ 1: తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తలకొండపల్లి మండల కేంద్రానికి గట్టుఇప్పలపల్లి 16 కిలోమీటర్ల దూరంలో ఉన్నదని తెలిపారు. తలకొండపల్లికి వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యాలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గతంలో రెండు సార్లు దీక్షలు చేసినట్లు తెలిపారు. 2023లో తెలంగాన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కొత్త మండలాలను ఏర్పాటు చేస్తున్న సందర్భంలో, గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ పాలకవర్గం సభ్యులు రాజీనామా చేసిన్నట్లు గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కల్వకుర్తి నియోజకవర్గంలోని రఘుపతిపేట, వెల్జాల్, గట్టుఇప్పలపల్లి గ్రామాలను మండలాలుగా ఏర్పాటు చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కల్వకుర్తి ప్రాంతానికే చెందిన వ్యక్తి రేవంత్‌రెడ్డి సీఎంగా ఉండడంతో, గట్టుఇప్పలపల్లి గ్రామ ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని జేఏసీ నాయకులు కోరుతున్నారు. దీక్షలో అశోక్‌గౌడ్, శరత్, ఆంజనేయులుగౌడ్, అనిల్, రాజు, యాదగిరి, ఆంజనేయులు, కృష్ణాజీ, చెన్నయ్య, నిరంజన్, తేజ, ప్రణయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి

షాబాద్: ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ తదితరులు

మంచాల: ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

షాబాద్, నవంబర్ 1: మండల పరిధిలో దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ మండలాధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, నాయకులు జనార్దన్‌రెడ్డి, రవీందర్‌నాయక్, ఆంజనేయులుగౌడ్, ఖుద్దుస్, గౌరీశ్వర్, సుభాశ్‌రెడ్డి, సంజీవరెడ్డి, జంగయ్య, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్లలో..

మంచాల: మండల పరిధిలోని ఆరుట్ల గ్రామంలో శుక్రవారం ఇందిరాగాంధీ వర్ధంతిని నిర్వహించారు. గ్రామంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలు, రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, శ్రీకాంత్, యాదయ్య, వెంకటేశ్, మల్లేశ్, జంగయ్య, వెంకటేశ్, చంద్రయ్య, బుగ్గరాములు, లచ్చురాం, బాషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతంను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్, నవంబర్ 1: తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతంను హైదరాబాద్‌లోని ఆయన కార్యాలయంలో శుక్రవారం కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు దీపావళి శుభాకాంక్షలు తెలిపి శాలువతో సన్మానించారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అధిక మొత్తంలో రుణాలను మంజూరు చేసి దళితులను ఆదుకోవాలని చైర్మన్‌ను కోరగా, ఆయన సానుకూలంగా స్పందించినట్లు నాయకులు తెలిపారు. చైర్మన్‌ను కలిసిన వారిలో పోతుగంటి అశోక్, ఎదుల శంకర్ ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఏట్ల ఎర్రవల్లిలో పశువుకు టీకా వేస్తున్న డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్, నవంబర్ 1: రైతులు తమ పశువులకు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని షాబాద్, రేగడిదోస్వాడ పశువైద్యాధికారులు డాక్టర్ స్రవంతి, చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాందార్‌ఖాన్‌పేట్, అప్పారెడ్డిగూడ, ఏట్ల ఎర్రవల్లి, దేవునిగడ్డ గ్రామాల్లో సిబ్బందితో కలిసి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... పశువులకు వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల రైతులు జాగ్రతలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది బలరాం, కృష్ణమూర్తి, శ్రీకాంత్, శ్రీనివాస్, సుధాకర్, బాల్‌రాజ్, రాణి, రైతులు పాల్గొన్నారు.

షాద్‌నగర్‌టౌన్: దీపావళి వేడుకలను జరుపుకుంటున్న మహిళలు

మొయినాబాద్: సురంగల్ గ్రామంలో టపాసులు కాల్చుతున్న చిన్నారులు

అంబరాన్నంటిన దీపావళి సంబురాలు

దీపావళి సంబురాలు అంబరాన్నంటాయి. పర్వదినాన్ని పురస్కరించుకొని గురువారం సాయంత్రం ఇండ్ల ముందు దీపాలను వెలిగించి వేడుకలను నిర్వహించుకున్నారు. పటాకులను పేలుస్తూ ఆనందోత్సాహాలతో సందడి చేశారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఉదయం నుంచే పండుగ వాతావరణం నెలకొంది. పటాకుల, పూల, కూరగాయల, నిత్యావసర వస్తువులతో పాటు మిఠాయి సముదాయాలు కిటకిటలాడాయి. పలువురు వ్యాపారులు దుకాణ సముదాయాలకు కొబ్బరి, అరటి, మామిడి కొమ్మలతో తోరణాలను కట్టి ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బొమ్మల కొలువులతో గౌరీ నోములను నోచి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.

– న్యూస్ నెట్‌వర్క్, రంగారెడ్డి జిల్లా, నవంబర్ 1

యాచారం: మేడిపల్లిలో వేడుకలు జరుపుకుంటున్న కుటుంబ సభ్యులు

షాబాద్: ఓ ఇంటి ముందు టపాసులు కాలుస్తున్న దృశ్యం